# కాటుక కళ్ళజోడు

కాశీనాథ
&
కాశీనాథ

'అతిపుత్రస్య గతిర్నాస్తి' అని ఫామిలీ ప్లానింగువాళ్ళు ఘోష పెడుతున్నా పట్టించుకోకుండా ఎనిమిదిమంది పిల్లల్ని కన్నారు వసుదేవరావుగారు. అష్టమగర్భాన పుత్రుడు పుట్టాడు. నల్లగా ఉన్నాడు. పైగా రోహిణీ నక్షత్రంలో పుట్టాడు కాబట్టి 'కృష్ణుడు' అని పేరు పెట్టారు. ఇంట్లోఅంతా 'కిష్ణుడూ' అంటారు. మేము 'కిష్టిగాడు' అంటాము. వాడు మేము, చిన్నప్పట్నించీ ఇప్పటిదాకా పక్కపక్క వాటాల్లో ఉంటున్నాము.

చిన్నతనంలోనే పక్కయింటి రాము ఆడుకునే బండి బొమ్మలో చక్రం విరగ్గొట్టాడు. ఆవుదూడ బొమ్మ. కొంగ బొమ్మ విరగ్గొట్టాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ దెబ్బలాడుకోవడం, అది తల్లులదాకా వెళ్ళడం. మొదట కొట్టినది మీవాడు అంటే మీవాడు అని రాముతల్లీ, కిష్టుడితల్లీ దెబ్బలాడుకోవడం, "మా రాము ఎన్నడూ చెయ్యడు మా రాము" అని రాము తల్లి, "మా కిష్టుడు మాకిష్టుడు అందరి కిష్ణుడు వాడినిమాటలంటే భరించలేము" అని కిష్టుడి తల్లిఅనటం, పిల్లల దెబ్బలాట అయిపోయినా పెద్దల దెబ్బలాట అలాగే ఉండటం జరిగాయి.

కృష్ణుడు పెద్దవాడయాక పెద్ద కృష్ణుడి లీలలు మొదలుపెట్టాడు. ఆస్తి ఉందికాబట్టి చదువుమీద శ్రద్ధ లేకుండానే పెరిగాడు.

వాడికి వయసు వచ్చీరాకముందే పెళ్ళిమీద ఆత్రం ప్రారంభమయింది. ప్రతి మనిషికీ అద్దంలో ప్రతిబింబం యిష్టంగా కనపడితే వాడికి లోపభూయిష్టంగా కనపడేది. అందువల్ల తనకి పెళ్ళి కాదేమోనన్న భయం పట్టుకుంది వాడికి. పెళ్ళి వాడివీక్‌నెస్. మనం మంచిసలహా ఇచ్చినా వాడువినకపోతే 'ఇలా చెయ్యకపోతే నీకు పెళ్ళికాదురా' అంటే వెంటనే చెప్పినట్లు చేసేసేవాడు.

'పెళ్ళిని గురించి నీకేం తెలుసురా; అంత ఆత్రపడతావు?' అంటే జీవితంలో డబుల్ బెనిఫిట్ ఇచ్చేవి రెండే. మొదటిది కథ రాయటం. మన కథా ప్రచురిస్తారు. డబ్బూ ఇస్తారు. రెండోది పెళ్ళి. పిల్లనీ యిస్తారు. కట్నమూ ఇస్తామంటారు' అన్నాడు.

హైస్కూల్లోనే వాడి ప్రేమపరిమళించింది. అమ్మాయిల వెంటపడేవాడని హెడ్మాస్టరుకితెలిసినాకాండక్టు సర్టిఫికెట్‌లో 'గుడ్' అనిరాశాడు 'హెడ్మాస్టరుకి మీనాన్న తెలుసు కాబట్టి అలా రాశాడు' అంటే 'నా మొహం. సేటిస్ఫేకరీకి స్పెల్లింగురాకగుడ్ అనిరాశాడు' అంటాడుకృష్ణ.

నల్లకళ్ళజోడు వాడి ట్రేడ్‌మార్కు. అవి లేకుండా ఎప్పుడూ కనిపించడు. "కూలింగ్ గ్లాసెస్ కృష్ణ" అంటే చాలా మందికి తెలుసు.

వాడికి అమ్మాయిలు కాటుక పెట్టుకుంటే ఇష్టం. "కాటుక పెట్టుకుంటే కళ్ళు అందంగా ఉంటాయని తెలిసీ కూడా చాలామంది అమ్మాయిలు కాటుక ఎందుకు పెట్టుకోరో నాకు అర్థంకాదు' అంటాడు. వాడు అమ్మాయిలని ప్రేమించేముందు ఆ అమ్మాయి కాటుకపెట్టుకుందో లేదో గమనించి మరీ ప్రేమిస్తాడు, ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ప్రేమించడంలో వాడి ఉద్దేశం పెళ్ళి చేసుకోవడమేగాని మోసం చెయ్యడంకాదు ప్రేమ ఫెయిలయితే బాధపడడు. చొక్కా మార్చుకున్నంత వేగంగా ప్రేయసిని మార్చేస్తాడు. కాని మరో కాటుక కళ్ళ అమ్మాయి కనిపిస్తేనే పాత ప్రేయసిని మారుస్తాడు. ఒక సమయంలో ఒక అమ్మాయినే ప్రేమించాలనే నియమం వాడికిలేదు.

కాలేజీ రోజుల్లో వాడికి లలిత కళలంటే ఇష్టం. లలిత ఎదురింటి అమ్మాయి. కళ పక్కింటి అమ్మాయి. కళారాధనచేస్తూ ఆమెని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుని ఆ అమ్మాయి తండ్రికి స్నేహితుడయిన ఫిజిక్సు లెక్చరర్ని కలుసుకుని 'మీరు కాస్త రికమెండ్, చెయ్యండి సార్' అని అడిగాడు.

'చదువు నుంచి ఎస్కేప్ వెలాసిటీ సినిమాహాళ్ళచుట్టూ ఆర్బిటల్ వెలాసిటీ ఎక్కువగా కలవాడివి నిన్ను చూస్తూ చూస్తూ ఎలా రికమెండ్ చెయ్యనోయ్? అన్నారు ఆయన. లలిత గురించి ఇంకెవర్నీ అడగలేకపోయాడు.

'పాఠ్యగ్రంథాలు చూసి పరీక్షలురాసేపద్ధతి ప్రభుత్వం ప్రవేశపెట్టకముందే కొందరు విద్యార్థులు ప్రవేశపెట్టారు. ఆ పద్ధతిలో బి. ఏ

> కాలేజీ రోజుల్లో వాడికి లలితకళలంటే ఇష్టం. లలిత ఎదురింటి అమ్మాయి కళ పక్కింటి అమ్మాయి. కళారాధనచేస్తూ ఆమెని పెళ్ళి చేసుకోవాలని ఆ అమ్మాయి తండ్రికి స్నేహితుడయిన ఫిజిక్సు లెక్చరర్ని కలుసుకుని 'మీరు రికమెండ్ చెయ్యండి' అని అడిగాడు.



పాసయిపోయాడు కృష్ణ. (స్లిప్ టెస్టులలో కూడా సిప్స్ చూసి మాత్రమే రాశేవాడు.)

ఆ తర్వాత వాడికి ప్రకృతిలోని ప్రేమ స్వరూపం లీలగా కనిపించడం ప్రారంభించింది. లీల విషయం నాలుగురోజులలోనే బెడిసికొట్టింది. లీల అయితే అతనికి బాడీగార్డు స్టేటస్ ఇచ్చింది కాని లీలకి ఒక అన్నయ్య ఉండటంవల్ల కథలో అపశ్రుతి పలికింది. ఆ అన్నయ్యకి ఈ లీలా కృష్ణ ప్రహసనం నచ్చినట్టులేదని కృష్ణని దధీచిలాగా తయారుచేద్దామని పథకం వేసుకుని బయలుదేరుతున్నాడని (నిత్యసం) చారులవల్ల తెలుసుకున్న కృష్ణ స్నేహితుడొకడు చీటీరాసి అర్జెంటుగా కృష్ణకి పంపించాడు.

డియర్ కృష్ణా.

లీల అన్నయ్య నిన్ను 'ఇన్‌వర్టి బ్రేటా' జాతిలో చేర్చదలచుకున్నాడు నీ పంథో కాల్బియం అంతా ధ్వంసం చెద్దామనికూడా పథకం వేసుకుని బయలుదేరుతున్నాడు. నువ్వ కొన్నాళ్ళు కనిపించకపోవడం మంచిది.

ఇంతే సంగతులు

(పలాయనం) చిత్తగించవలెను

అని ఉత్తరం రాశాడు. అప్పుడు వెళ్ళిన కృష్ణ 15 రోజుల తర్వాత పరిస్థితులు చక్కబడిన 'కృష్ణ పక్షం'లో తిరిగి వచ్చాడు.

కాలక్రమాన వాడిది కుసుమ కోమల హృదయం అయింది. 'ఆడపిల్లలకి కథలురాసే వాళ్ళంటే ఇష్టం ఉంటుంది. ఉత్తరాలురాస్తారు. బహూశా ప్రేమించవచ్చు' అని ఎవరో సలహా ఇచ్చారు కృష్ణకి. వెంటనే రెండు కథలు రాసి నా దగ్గరకి తీసుకువచ్చాడు. కథలుచదవకుండా జాగ్రత్తపడ్డాను. 'కనీసం వాటికి టైటిల్స్ ఏం పెట్టాలో చెప్పురా' అన్నాడు

'ఉన్నాయిగా స్టాండర్డు టైటిల్సు! ఎండ మావులు, నేరము–శిక్ష, సమాంతర రేఖలు వీటిలో ఏవో పెట్టెయ్' అన్నాను మొదటి రెండు పేర్లు సెలకు చేసుకున్నాడు. సమాంతర రేఖలు తర్వాత రాస్తానన్నాడు.

ఏంతంటాలు పడ్డాడోగాని మొత్తానికి ఒక ప్రముఖమైన వీక్లీ లో అవి ప్రచురించబడే ఏర్పాటుచేసుకున్నాడు. 'ఈకథలమీద ఉత్తరాలు వస్తే అవి ప్రచురించడంతో పాటు నాకు పంపించవలసినదిగా కోరుతున్నాను' అని రాశాడు. రెండు కథలూ ఒకే సంచికలో వేసి బాధ్యత వదిలించుకున్నారు ఆ పత్రికాధిపతులు. పాఠకులు వ్రాసిన రెండు ఉత్తరాలు పోస్టులో పంపించి 'మీకు అభ్యంతరం లేకపోతే వీటిని ప్రచురిస్తాము' అని రాశారు. ఒకదానితో 'ఎండమావులు' అనే కథలో ఏ ఒక్క వాక్యమైనా బాగుంటుందేమోనని చివరిదాకా చదివిన మా ఆశలు ఎండమావులే అయ్యాయి' అని ఉంది రాసినవారి పేరు చూశాడు. కుసుమ. రెండో ఉత్తరంలో 'ఎడిటరుగారూ! రచయిత నేరం చేస్తే పాఠకుల కెందుకీ శిక్ష?' అని ఉంది. రాసినది కోమల.

ఆ తర్వాత కొన్నాళ్ళకి వరలక్ష్మి అనేమరో కాటుక కళ్ళ అమ్మాయిని నల్లికళ్ళజోడులో నుంచి చూసి ప్రేమించాడు. రెండు రోజులు కష్టపడి పదాలు ఏర్చికూర్చి అతి చిన్నఉత్తరం

రాశాడు ఆ అమ్మాయికి. 'నిన్నే వరించాను. కలవరించాను. కలలో నీ ముంగురుల్ని సవరించాను....వరం! నీ ప్రేమ నాకు వరంకావాలి' అని రాశాడు. వెంటనే జవాబు వచ్చింది. నేను మరొక అబ్బాయి మనసుని అపరించాను. నా భావాలు వెలువరించాను. నా పరిస్థితి మీకు వివరించాను. మీ యిష్టం.....నాకు వరుడు కావాలంటే కవి వరుడు కావాలి' అని రాసింది వరలక్ష్మి.

కృష్ణ ఇలా వరసగా ఒకరి తర్వాత ఒకరిని ప్రేమిస్తున్నాడంటే నాకూ ఆశ్చర్యంగానే ఉంటుంది. ఎందుకంటే మా కృష్ణకి నిద్రాదేవి ఎప్పుడూ రెప్పలమీద కూర్చుని ఉంటుంది. ఆ రెప్పలు ఆమె బరువుకి ఎప్పుడూ వాలిపోతూ ఉంటాయి. ఆ నిద్రలోనే తీరిక చేసుకుని ప్రేమిస్తూ ఉంటాడనుకుంటాను. వాడు సత్యాన్వేషణలో ఉన్నప్పుడు సత్యని మరొకడు ప్రేమించాడని పెళ్ళి ముహూర్తం ఆ రోజే పెట్టుకుంటున్నారని నాకు తెలిసింది. వెంటనే వాడి రూముకివెళ్ళి వాడిని నిద్రలేపడానికి నా శాయశక్తులా ప్రయత్నించాను. నిద్ర మత్తులోనే 'అబ్బ. నన్ను నిద్రలేపితేగాని నీకు నిద్ర పట్టదులా ఉందే!'అన్నాడు. సత్యని మరొకడు ప్రేమిస్తున్నాడని చెప్పాను కళ్ళు కొద్దిగా తెరిచి 'ఎవడు వాడు? వాడి గుండెల్లో నిద్రపోతాను' అంటూ మళ్ళీ పడుకున్నాడు. 'నీ నిద్రకి ఓ నమస్కారం' అనుకుని వాడిని బలవంతాన లేపి 'సత్యకి పెళ్ళిముహూర్తం పెడుతున్నారు' అని చెప్పాను. వాడికి మత్తు వదిలి అర్థం అయి తిన్నగా సత్య దగ్గిరకివెళ్ళి నిర్మోహమాటంగా చెప్పేశాడు. 'నువ్వు ప్రేమించేదాకా నీ యింటిముందు నుంచి కదలను. ఇలాగే పడి ఉంటాను–ఎండకిఎండుతూ వానకి వానుతూ' అన్నాడు.

'వానుతూ ఏమిటి నా మొహం! తెలుగే రానివాడివి నిన్నెలా చేసుకోను?' అనేసింది సత్య.





తెలంగాణా మరియు రాయలసీమ జిల్లాలో ప్రాతినిధ్యంలేని ప్రాంతాలకు డీలర్లు/స్టాకిస్టులు కావలెను.

వాస్కాన్ ప్రొడక్ట్స్

1-2-296, శ్రీరామాంజనేయ నిలయము, దోమలగూడ, హైదరాబాద్-500 029.




## సినిమాతీశావా?

బాబిగాడి బుగ్గ, ఎర్రగా కందిపోయింది.

"అదేమిట్రా? ఏమయింది?" అడిగింది వాళ్ళమ్మగారు.

"ఇందాకా మనింటికి వచ్చిన బిచ్చగాడ్ని నువ్వు తెలుగు సినిమా తీసావా? అనడిగా.... అంతే...." అన్నాడు బాబిగాడు.

రామశ్రీను. (విశాఖ)

ఆ దెబ్బకి ఏడ్చి ఏడ్చి అతడి కళ్ళు అరుణ రాగరంజితాలయాయి. తర్వాత అతడి జీవితంలో వసంతఋతువు రావడం, ఆ పైన స్వప్న సీమలో విహరించడం జరిగాయి.

ఆ తర్వాత డిబేటింగ్ పోటీలో బాగా మాట్లాడి ఫస్టు ప్రయిజు గెలుచుకుని స్టేజి దిగి వస్తున్న అమ్మాయినిచూసి జయజయధ్వానాలు చేశాడుగాని, ఆ అమ్మాయికి హఠాత్తుగా ఐడియా వచ్చి కాటుక పెట్టుకోవడం మానేసింది! అంతేకాదు తను కనిపెట్టిన ఈ టెక్నిక్ గురించి తన కనబడిన వాళ్ళందరికీ చెప్పడం ప్రారంభించింది!

ఆ తర్వాత విశారదని హిందీ నేర్పమని అడగటం, సంపూర్ణజ్ఞానం పొందటానికి ప్రయత్నించటం– శాంతస్వభావుడై– ఆపైన పద్మబాంధవుడైన సూర్యుని పూజించడం— 'రోహిణీ నక్షత్రాన పుట్టాను కాబట్టి నాకు శాంతి అవసరం అని పురోహితుడు చెప్పాడు. కనీసం రోహిణి అయినా అవసరం అని మరో హితుడు చెప్పాడు'అని ప్రకటించడం– తర్వాత విశాల హృదయంతో ఆలోచించి– సామ్రాజ్యవాదులలో చేరటం– చివరగా చదువులోపడి వాణి నా రాణి అనుకోవడం– ఆ తొమ్మిదిమందీ కాటుక పెట్టుకోవడం హఠాత్తుగా మానెయ్యటం జరిగాయి.

ఉన్నట్టుండి మా వూళ్ళోకి కాటుక కంపెనీ సేల్సు మేనేజరు కల్యాణరావుగారు దిగారు. మా వూళ్ళో కాటుక డబ్బాల అమ్మకం హఠాత్తుగా నూటికి తొంభయి అయిదు పాళ్ళు తగ్గిపోయిందిట! 'ఇంత హఠాత్తుగా కాటుక అమ్మకం దారుణంగా తగ్గిపోవడంలో గహస్యం నువ్వు కనుక్కోగలవా?' అని ప్రొప్రయిటరు కల్యాణరావు గారిని అడిగారుట.



### పేచీ

'ఒరే బాబూ! చెల్లి పది పైసల బిళ్ళ మింగింది, త్వరగా డాక్టర్‌ని పిలుచుకురా' అదుర్దాగా అంది అనసూయమ్మ.

"పోనీలే అమ్మా! నేను ఆ పది పైసల కోసం పేచీ పెట్టనులే...." అన్నాడు బాబు.

—బి. పద్మజ (అనంతపూర్)

'తప్పకుండా కనుక్కుంటాను. కనుక్కోలేక పోతే నా పేరు కాటుకకల్యాణరావే కాదు' అని శపథం చేసి వచ్చారుట ఆయన. ఆయన నాకు దూరపు బంధువు. మా యింట్లోనే దిగాడు. అందుచేత ఆయనకి ఏ శ్రమా లేకుండానే రహస్యం నా వల్ల తెలిసిపోయింది. ఆయన సరాసరి కృష్ణ దగ్గరకివెళ్ళి 'నువ్వు పెళ్ళి చేసుకున్నా కాటుక కళ్ళ అమ్మాయిలని ప్రేమించడం మానేసినా నీకు మా కంపెనీలో మంచి ఉద్యోగం ఇస్తాను' అని ఆశపెట్టాడు. మా (బిద్ధ) కిష్టి గాడికి ఉద్యోగం అంటే పడదు అందువల్ల కల్యాణరావు గారు నిరాశపడి వెళ్ళిపోయారు

చివరగా మా కృష్ణ దృష్టి కవితపై పడింది

'నీకాటుకకళ్ళు బాగున్నాయి' అన్నాడుకృష్ణ

'నీ నల్ల కళ్ళజోడు బాగుంది' అందికవిత.

అప్పటి నుంచీ వాడిమాటలు కవితామయం అయాయి. ఆ అమ్మాయిని బాగా ఆకర్షించాడు పండితుడి మనవరాలు కావడంవల్ల చమత్కారాలు గుప్పించి ఆమె ప్రేమని గెలుచుకున్నాడు.

'నీ మనసు వెన్నలాంటిది. నేను వెన్న దొంగ కృష్ణుడిని' అన్నాడు కవితతో. కవిత సంతోషించి 'ఆ కృష్ణుడి లాగానే దొంగతనం చేశావే' అంది. 'దొంగతనం కృష్ణుడికివెన్నతో పెట్టిన విద్య' అన్నాడు. 'నాతో మాట్లాడుతోంటే నీకు కవిత్వం వచ్చిందే' అంది 'కన్నెదుట ఉన్న పిల్లని చూస్తే ఆ కన్నెదుట ఉన్న పిల్ల వాడికి కవిత రాదా?' అన్నాడు కవిత మురిసిపోయి 'నాలో అంత అందం నిజంగా కనిపిస్తోందా? నువ్వు రంగుటద్దాల లోంచి చూస్తున్నావుగా' అంది కిలకిల నవ్వుతూ.


భాగ్యలక్ష్మి

మీ ఇంట్లో కనకవర్షం కురిపిస్తుంది



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాటరీ

ఇప్పుడు పదిహేనురోజులకు ఒకసారి

ప్రతినెలలో
8 మరియు 23 తేదీలలో

టికెట్ ఖరీదు రు. 1/-
ప్రత్యేక బహుమతి: రూ. 2,00,000
(అన్ని పన్నులతో సహా)

మొత్తము బహుమతుల విలువ: రూ. 5,30,000
బహుమతుల మొత్తము : 30,493

ASP/B/8117/A

హోల్ సెల్లింగ్ ఏజంట్లు:
ఆంధ్ర ప్రదేశ్ స్టేట్
ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్,
5-10-174, ఫతే మైదాన్ రోడ్,
హైదరాబాద్-500 004

జారీ చేసినవారు:
డైరెక్టర్ ఆఫ్ స్మాల్ సేవింగ్స్ అండ్
స్టేట్ లాటరీస్, ఆంధ్ర ప్రదేశ్
హైదరాబాద్-500 004,

కవితకి ఒక తాతగారు ఉన్నారు. ఆయన పద్యాలు బాగా రాస్తారు. మన దేశానికి పరోక్షంగా స్వాతంత్ర్యం తెచ్చిన వాళ్ళలో ఆయనొకడుట. ఆయన 1947 జనవరిలో సంగీత సాధన మొదలు పెట్టాడు. జూలై దాకా చూసి ఆగస్టులో బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోయారు. తన అనుభవాల సారం అంతా పద్యాల్లో కూర్చి 'మన చరిత్ర' అనే గ్రంథం రాశాడు ఆయన. ప్రచురించేవాళ్ళు, వినేవాళ్ళ కోసం ఆయన తహతహ లాడుతున్నాడు. కృష్ణ ఆ గ్రంథం తీసుకుని మొదటి రెండు పేజీలు చదివి 'ఇది మను చరిత్రలా ఉంది. మీరు అల్లసాని పెద్దన అంతటివారు' అన్నాడు. అప్పట్నించీ ఆ యింటికి కృష్ణ రాకపోకలకి లైసెన్సు వచ్చింది. ఆయన ఇంట్లో వున్నంతసేపు ఆయన కవితా గోష్ఠి ఆయన సాయంత్రం షికారుకని బయటికి వెళ్ళాక కృష్ణుడి కవితా గోష్ఠి జరిగేవి.

ఒకసారి అది ఆ ముసలాయన దృష్టిలో పడింది.

'ఏమయ్యా! నువ్వు నా కోసం వస్తున్నావా? నా మనవరాలి కోసం వస్తున్నావా?' అని అడిగేశారు ఆయన సూటిగా.

'నిజం చెప్పాలంటే మీ మనవరాలికోసమే నండి' అన్నాడు కృష్ణ ఇంకా సూటిగా.

'అయితే రోజూవచ్చి నా పద్యాలు ఎందుకు వింటున్నావు?'

'పెద్దకవులు కాబట్టి బాగానే ఉంటాయను కుంటున్నాను'

'అనుకోవడమేమిటి? సరిగ్గా వినలేదా?'

'విన్నానుగాని అర్థం కాలేదండి'

'మరి నన్ను అల్లసాని పెద్దన అన్నావు?' కృష్ణ ఆలోచించి 'మీరు కవితా పితామహులు కదండీ' అన్నాడు.

ఫెళఫెళా నవ్వేశాడు ఆయన. 'ఉండాల్సిన వాడివయ్యా! నీకు నా కవితా కన్య నిస్తున్నాను. ఇవాళే మా అబ్బాయికి ఉత్తరం రాస్తాను.' అనేశారు ఆయన ఆనంద బాష్పాలతో.

అంతే! పెళ్ళి కుదిరిపోయింది. మేమంతా సంతోషించాము. ఇంత మంది కాటుక కళ్ళ అమ్మాయిలని ప్రేమించి విఫలమయినా మా నల్ల కళ్ళ జోడు అబ్బాయి (విశేషణం రెండింటికీ వర్తిస్తుంది) చివరకి విజయం పొంది తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్న పెళ్ళిని సాధిస్తున్నందుకు ఆనందం. నిజంగా పెళ్ళిచేసుకుంటున్నందుకు విచారం కలిగాయి.

* * *

కవితతో కృష్ణపెళ్ళి వైభవంగా జరిగిపోయింది. కృష్ణలీలలు పూర్తిగా మాయమయిపోయాయి. కవిత ఆ విషయంలో పూర్తి నిర్బంధం అమలు పరచింది.

ఊళ్ళో అమ్మాయిలంతా ధైర్యంగా కాటుక పెట్టుకోవటం ప్రారంభించారు. కాటుక డబ్బాల సేల్స్ పూర్వస్థాయికి వచ్చాయి.

కల్యాణ రావుగారు మళ్ళీవచ్చి కాటుక కంపెనీలో ఉద్యోగం కవితకి ఇస్తానని చెప్పారు. ఉద్యోగం అనే వ్యాపకం పెట్టుకుంటే కృష్ణని దిగ్బంధం చెయ్యడానికి వీలుండదని ఆలోచించి ఉద్యోగం వద్దని కల్యాణరావు గారికి చెప్పేసింది కవిత.

* * *

తను ఇన్నాళ్ళు కలవరించిన పెళ్ళి అనేది నిజంగా మయసభ అని తెలుసుకున్న తర్వాత కృష్ణలీలలు మానేసి దుర్యోధనుడి డైలాగులు మొదలుపెట్టాడు కృష్ణ.

'ఓ మామా! నీకొక అందమైన కాటుక కళ్ళపుత్రిక ఏల ఉండవలె? ఆమెకి పెళ్ళి చేయ నీవేల సంకల్పించవలె? సంకల్పించితివి పో, నీకు ఈ కళ్ళజోడు అబ్బాయి ఏల దొరకవలె? పెళ్ళిఅని తెలిసి తెలిసి నేనేల అంగీకరించవలె?....

